
సదస్సులో నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

'రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడమే బీజేపీ లక్ష్యం'

కవాడిగూడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడమే బీజేపీ లక్ష్యమని తెలంగాణ ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. 'రాజ్యాంగ హక్కులు - కాపాడుకోవాల్సిన బాధ్యత' అనే అంశంపై గురువారం దోమలగూడలోని ఆప్ కార్యాలయంలో సదస్సు నిర్వహించారు.ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ఆప్ పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి రాజ్యాంగంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ, మనుస్మృతి అమలుకు ఆర్ఎస్ఎస్ సంఘ్ పరివార్ ఒత్తిడి మేరకు భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా బీజేపీ పని చేస్తున్నదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు ఆమ్ ఆద్మీ పార్టీ 13వ వ్యవస్థాపక దినోత్సవం, 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ విలువలను కాడాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్రరాముగౌడ్, నేతలు ఆఫీస్, జావిద్, షరీఫ్, ఠాకూర్ రాజేష్ సింగ్, విజయ్‌కుమార్, శివాజీ, కొడంగల్ శ్రీనివాస్ ఎండీ అజీమ్, ఎం వివేక్, ధర్మేందర్, తివారీ తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

● సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఎర్నా


భోలక్‌పూర్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఏసీపీ ఎర్నా

ముషీరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఎర్నా తెలిపారు. గురువారం ముషీరాబాద్ నుంచి సీజీఓ టవర్స్ వరకు ఆపరేషన్ రోప్ కార్యక్రమంలో భాగంగా రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా ఎర్నా మాట్లాడుతూ... నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆపరేషన్ రోప్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. వ్యాపారులు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ వీరేశం, ఎస్సైలు కార్తీక్, యాదగిరి, జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే ముఠా గోపాల్


అశోక్‌కుమార్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ముషీరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య సమస్యలతో బాధపడుతూ కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు, మాజీ సైనికుడు బీమర్తి అశోక్ కుమార్‌ను ఎమ్మెల్యే ముఠాగోపాల్ గురువారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆపదలో ఉన్న కార్యకర్తలకు అండగా ఉంటామని, అశోక్‌కుమార్‌కు మెరుగైన వైద్యం అందించేలా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పైప్‌లైన్ పనులతో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

ముషీరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ డివిజన్‌లోని హజార్ గల్లీలో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కొత్త పైప్‌లైన్‌లు ఏర్పాటు చేస్తున్నామని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్ అన్నారు. గురువారం హజార్ గల్లీలో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... రూ. 16 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనుల వల్ల నిత్యం ఏర్పడుతున్న డ్రైనేజీ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిధులతో ఈ పైప్‌లైన్ పనులను చేపట్టామని పేర్కొన్నారు. ముషీరాబాద్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి కంచికుమార్ ముదిరాజ్, అజయ్ గుప్తా, నాయకులు లక్ష్మణ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి


సమావేశంలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వచ్చే డీఎస్సీలో 26వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ ఆధ్వర్యంలో గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లో నిర్వహించిన నిరుద్యోగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ, ఏ పాఠశాలకు వెళ్లి చూసినా ఉపాధ్యాయులు లేక ఖాళీ కుర్చీలు దర్శనమిస్తుండగా, విద్యాశాఖ అధికారులు మాత్రం టీచర్ పోస్టులు తక్కువగా ఉన్నట్లు తప్పుడు లెక్కలు చూపిస్తుండడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. ఇంగ్లీషు, మ్యాథ్స్ టీచర్ పోస్టులు చాలా ఖాళీగా ఉన్నాయని పలువురు నిరుద్యోగులు తన దృష్టికి తీసుకువచ్చినట్లు ఆయన వెల్లడించారు. పాఠశాలల్లో పీఈటీ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. 20 ఏళ్లుగా ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం మూలంగా అవి మూసివేసే దిశలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని సూచించారు.

పిల్లలకు వారంలోగా సర్టిఫికెట్లు ఇవ్వాలి: కలెక్టర్

హైదరాబాద్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎన్జీవోస్, శిశు విహార్ సంరక్షణ కేంద్రాల్లోని పిల్లలకు ఆధార్, పుట్టినతేదీ, కులం సర్టిఫికెట్లను వారం రోజుల్లోగా జారీ చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ, జిల్లా సంక్షేమాధికారి, జీహెచ్ఎంసీ సీఎంఓ, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్, డీసీపీఓ, స్వచ్ఛంద సంస్థలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛంద సంస్థలు, శిశువిహార్ సంరక్షణ కేంద్రంలోని 1500 పిల్లల కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డీఆర్ఓ వెంకటాచారి, జీహెచ్ఎంసీ సీఎంఓ డాక్టర్ పద్మజ, డీడబ్ల్యూఓ అక్కేశ్వరరావు, డీసీపీఓ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజేంద్రనాథ్, ఆర్డీఓ సాయిరాం, ఎస్ఈఎం జ్యోతి పాల్గొన్నారు.

భగవద్గీత గానంతో చిరస్మరణీయుడైన ఘంటసాల

● డా. ఓలేటి పార్వతీశం


గాయకులను సత్కరించిన పార్వతీశం, రామరాజు తదితరులు

చిక్కడపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సినిమాల్లో భక్తి, వైరాగ్య ప్రేమ విరహ పాటలు ఎన్నో పాడిన ఘంటసాల భగవద్గీత గానంతో చిరస్మరణీయుడు అయ్యారని ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం అన్నారు. ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్(ఇండియా) ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయ గానసభలో ఘంటసాల భగవద్గీత గానం చేసి యాభై ఏళ్లు అయిన సందర్భంగా ఘంటసాల భగవద్గీత స్వర్ణోత్సవం సంగీత విభావరి నిర్వహించారు. ప్రముఖ గాయకులు బాలకామేశ్వరరావు, ఫణి, చింతలపాటి సురేష్, హృషికేశ్‌లు ఘంటసాల పాడిన గీతాలతో శ్రోతలను తన్మయులను చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా ఓలేటి పార్వతీశం గాయకులను సత్కరించి మాట్లాడారు. ఘంటసాల చివరి రోజుల్లో పాడిన గీత ప్రతి తెలుగువారి ఇంటికి చేరిందన్నారు. విదేశాల్లో సైతం ఘంటసాల గీతాగానం సుప్రభాతంగా వింటున్నారన్నారు. ఘంటసాలపై అత్యంత భక్తితో వంశీ రామరాజు గుడి కట్టి ఆయనకు నిత్యపూజలు చేయడం విశేషమన్నారు. డా. వంశీ రామరాజు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సుంకరపల్లి శైలజ, డా. తెన్నేటి సుధ పాల్గొన్నారు.

బండమైసమ్మనగర్‌లో రెచ్చిపోతున్న గంజాయి బ్యాచ్

● బస్తీ అరుగులపై అర్ధరాత్రి వరకు తిష్ట
● గంజాయి మత్తులో దారినపోయే వారితో యువకుల గొడవ
● వారిని ఇళ్లు ఖాళీ చేయించాలని యజమానులకు బస్తీవాసుల విజ్ఞప్తి
● సదరు యువకులపై పోలీసులకు, ఎమ్మెల్యేకు ఫిర్యాదు


గంజాయి సేవిస్తున్న యువకులపై ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు ఫిర్యాదు చేస్తున్న బండమైసమ్మనగర్ బస్తీవాసులు

కవాడిగూడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ బండమైసమ్మనగర్ బస్తీలో గంజాయి బ్యాచ్ ఆగడాలు పెరిగిపోయాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్తీలో కొందరు యువకులు గంజాయి తాగి ఇళ్ల అరుగులపై అర్ధరాత్రి వరకు తిష్టవేసి ఉంటూ నానా రభస చేస్తూ.. దారిన పోయేవారితో అకారణంగా గొడవ పడుతున్నారని బస్తీవాసులు వాపోతున్నారు. వారిని వెంటనే ఇల్లు ఖాళీ చేయించాలని ఇంటి యజమానులకు బస్తీవాసులు విజ్ఞప్తి చేశారు. బండమైసమ్మనగర్ బస్తీలో గంజాయి సేవించి ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై దోమలగూడ పోలీసులకు, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు కూడా ఫిర్యాదు చేశారు.

బయట గంజాయి తాగి వచ్చి...

బండమైసమ్మనగర్ బస్తీలో నివాసం ఉంటున్న కొందరు యువకులు ప్రతి రోజూ సాయంత్రం గంజాయి తాగి రాత్రి బస్తీకి చేరుకుంటున్నారు. రాత్రి 9 నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు బస్తీ రోడ్లపైన, ఇళ్ల అరుగులపైన కూర్చొని వారులో వారు గొడవ పడి అరుచుకోవడంతో పాటు రోడ్డు మీద వెళ్లే వాహనదారులు, పాదచారులతో గడవకు దిగుతున్నారు. వీరి ఆగడాలకు జడిసి రాత్రి పూట బయటకు వచ్చేందుకు బస్తీవాసులు భయపడుతున్నారు. బస్తీలో గొడవలు సృష్టించేందుకు ఆ యువకులు యత్నిస్తున్నారని భావించిన బస్తీవాసులు వారు అద్దెకు ఉంటున్న ఇళ్లకు వెళ్లి ఇంటి యజమానులను కలిశారు. యువకులు తమ ప్రవర్తన మార్చుకోవాలని, లేకపోతే వెంటనే ఇళ్లు ఖాళీ చేయించాలని ఇంటి యజమానులను కోరారు. అలాగే, బస్తీలో గంజాయి నియంత్రణకు చర్యలు తీసుకోవడంతో పాటు గంజాయి మత్తులో బస్తీవాసులను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను కలిసి విజ్ఞప్తి చేశామని బండమైసమ్మనగర్ బస్తీ వాసులు రాజు, రాజేష్, శివ, పవన్, విజయ్, మల్లికార్జున్, మహేష్, లవ, వాసు వికాస్ తెలిపారు.

మాట వినకపోతే జైలుకు పంపిస్తాం

బండమైసమ్మనగర్‌లో గంజాయి తాగి గొడవలు సృష్టిస్తున్న యువకులపై చర్యలు తీసుకోవాలని బస్తీ వాసులు ఫిర్యాదు చేశారు. అలాగే, వారు అద్దెకుంటున్న ఇంటి యజమానులను పిలిపించి కూడా మాట్లాడాలని కోరారు. బండమైసమ్మ నగర్ బస్తీ పరిసరాల్లో గంజాయి సేవించి స్థానికులకు ఇబ్బందులకు గురిచేస్తున్న వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తాం. అప్పటికీ వినకపోతే వారిని అరెస్టు చేసి జైలుకు పంపిస్తాం. ఇంటి యజమానులను కూడా పిలిచి కౌన్సెలింగ్ ఇస్తాం. బండమైసమ్మ నగర్‌లో ప్రతి నిత్యం పెట్రోలింగ్ నిర్వహించి గంజాయి బ్యాచ్ ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటాం.

-దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి

నెల రోజుల్లో తాగునీటి పైప్‌లైన్ పనులు పూర్తి

● జలమండలి డీజీఎం మోహన్‌రాజ్


ముషీరాబాద్‌లో తాగునీటి పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న డీజీఎం తదితరులు

ముషీరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నుంచి సాగర్‌లాల్ ఆసుపత్రి ప్రధాన రోడ్డువరకు తాగునీటి పైప్‌లైన్ లీకేజీలను అరికట్టేందుకు 1000ఎంఎం భారీ మంచినీటి పైప్‌లైన్‌లను ఏర్పాటు చేస్తున్నామని జలమండలి రిజర్వాయర్ డీజీఎం మోహన్‌రాజ్ తెలిపారు. గురువారం ముషీరాబాద్‌లోని చిలకలగూడ రిజర్వాయర్ నుంచి కొనసాగుతున్న 1000ఎంఎం మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను ఆయన సెక్షన్ మేనేజర్ సురేష్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం డీజీఎం మోహన్‌రాజ్ మాట్లాడుతూ...సుమారు రూ.3.66 కోట్లతో చేపడుతున్న నిర్మాణ పనులు నెలరోజుల్లో పూర్తి చేస్తామన్నారు. రిజర్వాయర్ ప్రధాన గేటు వరకు, దాయారం మార్కెట్ నుంచి సాగర్‌లాల్ ఆసుపత్రి చౌరస్తా వరకు పైప్‌లైన్ నిర్మాణ పనులు కొనసాగిస్తామని తెలిపారు. ముషీరాబాద్ మెట్రోస్టేషన్ నుంచి సాగర్‌లాల్ ఆసుపత్రి వరకు పలుచోట్ల రోడ్డుపై మంచినీరు లీకేజీ కావడం వల్ల రోడ్డు అధ్వానంగా మారడంతోపాటు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ రోడ్డులో పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉండగా మెట్రోస్టేషన్, భూగర్భంలో ఎలక్ట్రికల్ కేబుల్ తీగలు ఆలయం ట్రాఫిక్ తదితర సమస్యలు ఉండడంతో నిర్మాణ పనులను రిజర్వాయర్ నుంచి చేపట్టామన్నారు. పైప్‌లైన్ నిర్మాణ పనులు 650 మీటర్ల వరకు కొనసాగుతాయని, తద్వారా పైప్‌లైన్‌ల లీకేజీ పూర్తిగా అరికడుతున్నామని తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

● పీస్ కమిటీ సభ్యులకు కాచిగూడ ఏసీపీ వి.రఘు విజ్ఞప్తి

బర్కత్‌పుర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు పీస్ కమిటీ సభ్యులు పూర్తిగా సహకరించాలని కాచిగూడ ఏసీపీ వి.రఘు సూచించారు. గురువారం కాచిగూడ పీఎస్‌లో పీఎస్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వచ్చే క్రిస్మస్, నూతన సంవత్సరం వేడుకలు, సంక్రాంతి పర్వదినం ప్రశాంతంగా జరిగేలా అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏదైనా ఘటన జరిగితే పీఎస్ కమిటీ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించాన్నారు. సీఐ చంద్రకుమార్, అడ్మిని ఎస్ఐ సుభాష్, ఎస్ఐలు నరేష్, రవికుమార్ పాల్గొన్నారు.

రూ.5 లక్షల విలువైన ఫోన్లు బాధితులకు అందజేత


బాధితులకు మొబైల్ ఫోన్లను అందజేసిన ఏసీపీ రమేష్‌కుమార్ తదితరులు

చిక్కడపల్లి, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల కాలంలో పోగొట్టుకున్న రూ.5 లక్షల విలువైన 20 మొబైల్ ఫోన్లను పోలీసులు కనిపెట్టి బాధితులకు అప్పగించారు. గురువారం సాయంత్రం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఏసీపీ రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, ఎస్ఐ మౌనిక బాధితులకు ఫోన్లను అందజేశారు.

1న పద్మశాలీ సంఘం కార్తీక వనభోజనాలు

రాంనగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 1వ తేదీన ఉస్మానియా వర్సిటీలోని ఫ్యాకల్టీ క్లబ్‌లో కార్తీకమాస వనభోజనాలు, పద్మశాలీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వర్కాల కృష్ణ, చిలక శివకుమార్, కోశాధికారి భీమనపల్లి అశోక్‌లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అనిల్‌కుమార్, తెలంగాణ బీసీ కమిషన్ తొలి చైర్మన్ బీఎస్ రాములు తదితరులు హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని పద్మశాలీ కులస్థులంతా పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్‌ను సత్కరిస్తున్న ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, జస్టిస్ జి.చంద్రయ్య తదితరులు

డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్‌కు ఘన సన్మానం

బర్కత్‌పుర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నాలుగు దశాబ్దాలుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గాను తెలంగాణ మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్‌కు గురువారం ఘన సన్మానం చేశారు. బర్కత్‌పురలోని ఫోరం రాష్ట్ర కార్యాలయంలో గురువారం తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ జి.చంద్రయ్య, జస్టిస్ పీఎస్ నారాయణ, డాక్టర్ రవితేజ, మేజర్ డీజే సుధ, న్యాయవాది డీఎల్ పాండు తదితరులు శాలువా మెమోంటోతో డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్‌ను సత్కరించి అభినందించారు.

రాజ్యాంగ పరిరక్షణకు మాలలు ఏకీకృతం కావాలి

నల్లకుంట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం కోసం మాలలు ఏకీకృతం కావాల్సిన అవసరం ఉందని మాల మహానాడు సంఘం గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి క్రాంతికుమార్ అన్నారు. మాలలు ఎవరికీ వ్యతిరేకం కాదని, దళిత, గిరిజను, బహుజనులపై జరిగిన దాడులకు వ్యతిరేకంగా ముందుండి పోరాటం చేసిన చరిత్ర మాలలదని వారన్నారు. గురువారం నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్ బస్తీ అధ్యక్షుడు కె.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో డిసెంబర్ 1న మాలల సింహగర్జన విజయవంతం కోసం ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును పునర్ పరిశీలన చేయాలనే డిమాండ్‌తో డిసెంబర్ 1న జరిగే మాలల సింహగర్జనకు మాలలు తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. మాల మహానాడు సంఘం నాయకులు బత్తుల రవి, రాజగోపాల్, బలరాం, అర్జున్, సత్యనారాయణ, ప్రదీప్, బాలకృష్ణ, శ్రీధర్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.


రామాలయం వెనుక వీధిలో రోడ్డులో ఆక్రమణను ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న దృశ్యం

రాంనగర్‌లో రోడ్డు ఆక్రమణ తొలగింపు

రాంనగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ రామాలయం వెనుక వీధిలో జీహెచ్ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు స్థలాన్ని ఆక్రమించి ఓ ఇంటి యజమాని చేపట్టిన నిర్మాణ పనులను ముషీరాబాద్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం ఎక్స్‌కవేటర్ సహాయంతో కూల్చివేశారు. ఈ నెల 24వ తేదీన ఆంధ్రజ్యోతిలో రోడ్డు కబ్జా చేసి నిర్మాణం, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు అనే కథనానికి జోనల్ కమిషనర్ రఘుకిరణ్, ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ స్పందించారు. రోడ్డు ఆక్రమణను వెంటనే తొలగించాలని వారు ఆదేశించడంతో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్యలు సిబ్బందితో వెళ్లి కూల్చి వేశారు. అక్రమణ నిర్మాణం కూల్చివేసినందుకు స్థానికులు జీహెచ్ఎంసీ అధికారు లకు కృతజ్ఞతలు తెలిపారు. కూల్చివేతల్లో జీహెచ్ఎంసీ సిబ్బంది అనిల్,శ్రీధర్‌గౌడ్, జగన్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. అహోబిల్‌మఠ్, గాంధీనగర్, ఎర్రమంజిల్, కేర్ ఆస్పత్రి 11 కేవీ ఫీడర్ల పరిధిలోని ఏటీఐ, లైఫ్ ఆస్పత్రి, విజయబ్యాంక్, మిర్చిబండి, పంచా యతీరాజ్ ఆఫీస్, పోస్టాఫీస్ లేన్, వాటర్‌వర్క్స్, మహేశ్వరి టవర్స్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట, సాయిబాబా టెంపుల్, బ్యాంక్ ఆఫ్ బరోడా, విజయ ఆస్పత్రి పరిధిలోని సాయిబాబా కమాన్,ఆంధ్రాబ్యాంక్, నర్మద ఆస్పత్రి, మోర్ సూపర్ మార్కెట్, మార్వెల్ అపార్ట్‌మెంట్, విజయ ఎలక్ట్రికల్స్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5, ఇందిరానగర్ పరిధిలోని కిషన్‌రావు ఆస్పత్రి, తిలక్‌నగర్ తదితర ప్రాంతాల్లో 3నుంచి 5 వరకు విత్యుత్ సరఫరా ఉండదన్నారు.


అంబర్‌పేట ఆలీకేఫ్ చౌరస్తాలో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బాలగొని బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు


పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎం.నాగేష్ ముదిరాజ్ తదితరులు

మహాత్మా జ్యోతిరావుపూలేకు నివాళి

రాంనగర్/నల్లకుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సామాజిక తత్త్వవేత్త, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతిని ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పలువురు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంబర్‌పేట ఆలీకేఫ్ చౌరస్తాలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆధ్వర్యంలో పూలే వర్ధంతి నిర్వహించారు. పూలే విగ్రహానికి వీహెచ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, తెలంగాణ గౌడ కల్లు సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాల్‌రాజ్‌గౌడ్, కన్వీనర్ ఆయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు ఆలీకేఫ్ చౌరస్తాలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎం.నాగేష్ ముదిరాజ్ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆలీకేఫ్‌లో పూలే విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కే.పీ.మురళీకృష్ణ, బి.లింగంగౌడ్, లక్ష్మణ్‌గౌడ్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ● అడిక్‌మెట్ డివిజన్‌లోని ఫ్లైఓవర్ కింద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పూలే వర్ధంతిని నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, నగర నాయకులు నేత శ్రీనివాస్, సిరిగిరి శ్యామ్, చిట్టి, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బల్ల శ్రీనివాస్‌రెడ్డి, కె.సురేందర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మేడి సత్యనారాయణ తదితరులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో..

కుల వివక్ష వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలో పూలే వర్ధంతిని నిర్వహించారు. కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, కేవీపీఎస్ నాయకులు సుబ్బారావు, రాములు, ఆంజనేయులు పాల్గొన్నారు.

అరుంధతినగర్ బస్తీలో..

చిక్కడపల్లి,ఆంధ్రజ్యోతి: గాంధీనగర్ డివిజన్ పరిధిలోని అరుంధతినగర్ బస్తీలోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద బీజేపీ నాయకులతో కలిసి కార్పొరేటర్ ఎ. పావనీవినయ్‌కుమార్ నివాళులర్పించారు. బీజేపీ ఓబీసీమోర్చా జాతీయ కార్యవర్గస భ్యుడు పూసరాజు ముఖ్యఅతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వినయ్‌కుమార్, ఉమేష్, రత్నసాయిచంద్, ఆనంద్‌రావు, శ్రీకాంత్, నర్సింగ్‌రావు, సురేష్, లక్ష్మణ్‌యాదవ్, సత్యందోనేటి పాల్గొన్నారు.


అడిక్‌మెట్‌లో జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, నేత శ్రీనివాస్, శ్యామ్ తదితరులు


ఆలీకేఫ్ చౌరస్తాలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలుగు యువత తెలంగాణ అధికార ప్రతినిధి కె.కిరణ్‌కుమార్, నాయకులు భానుప్రకాష్, సత్యనారాయణ, శ్రీకాంత్


పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్, పూసరాజు తదితరులు


నింబోలిఅడ్డలోని డివిజన్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పించినకార్పొరేటర్ కన్నె ఉమాదేవి, నాయకులు కన్నె రమేష్‌యాదవ్; భీమ్‌రాజ్, రవియాదవ్ తదితరులు

వర్గీకరణతో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

● బీఎల్ఎఫ్ డిమాండ్

చిక్కడపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కులగణన అనంతరం ఏబీసీడీఈ వర్గీకరణతో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు దండి వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుల గణన అనంతరం బీసీ కులాల ప్రజల జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలకు విద్య ఆరోగ్య రంగాల్లో అమలు జరుగుతున్న విధంగానే ఏబీసీడీఈ వర్గీకరణతో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

ముషీరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు ముషీరాబాద్‌లో బూత్ స్థాయి నుంచి పార్టీ సభ్యత్వ నమోదు చేపడు తున్నామని డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బద్రినారాయణ అన్నారు. గురువారం ముషీరాబాద్‌లోని దళిత జాతీయ సంఘం వీధిలో ఇంటింటికీ వెళ్లి ఆన్‌లైన్‌లో బీజేపీ సభ్యత్వ నామోదు చేశారు. ఈ సందర్భంగా బద్రినారాయణ మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తూ పార్టీ సభ్యత్వం తీసుకునేలా కృషి చేస్తున్నామన్నారు. బీజేవైఎం ముషీరాబాద్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ సురేష్ కుమార్, పద్మ పాల్గొన్నారు.